నడిచేదెలా..?

- ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- కొన్ని చోట్ల శిథిలమైన కాలిబాటలు
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు



రైల్వే న్యూకాలనీ రోడ్డులో ఫుట్‌పాత్‌పై ద్విచక్ర వాహన విక్రయ వ్యాపారాలు



రైల్వే న్యూకాలనీలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన ఫర్నిచర్, ఆటో మొబైల్ షాప్‌లు



రైల్వే స్టేషన్ వీఐపీ రోడ్డులో ఫుట్‌పాత్‌పైకి విస్తరించిన చెట్ల కొమ్మలు



ప్రమాదరకరంగా ఫుట్‌పాత్ డ్రైనేజీ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో గల ఫుట్‌పాత్‌లు వినియోగించేందుకు వీలు లేకుండా ఉన్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారుల్లో నడిచేందుకు వీలు లేని విధంగా ఇవి తయారయ్యాయి. పాదచారులు ప్రమాదాల బారిన పడకుండా రహదారులకు ఇరువైపులా నిర్మించిన కాలిబాటలు కాస్తా.. వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయి. పలు చోట్ల ఆక్రమణలు, వ్యాపారాలతోనూ.. మరికొన్ని చోట్ల శిథిలావస్థలోనూ ఫుట్‌పాత్‌లు దర్శనమిస్తున్నాయి. ఇటీవల ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేసుకునే వారిని ఖాళీ చేయించిన జీవీఎంసీ అధికారులు.. పెద్ద పెద్ద వ్యాపారాలు నిర్వహించే వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని పలువురు మండిపడుతున్నారు.

ఈ ప్రాంతాల్లో ఇదీ పరిస్థితి..

- **తాటిచెట్లపాలెం నుంచి రైల్వే స్టేషన్ వీఐపీ రోడ్డులో పలుచోట్ల ఫుట్‌పాత్‌లపై దట్టంగా** మొక్కలు పెరగడంతో నడిచేందుకు వీలు లేకుండా మారింది. ఇదే ప్రాంతంలో కాలిబాటలపై ఇసుక, పిక్క వేసి రోజుల తరబడి వదిలేయడంతో పాదచారులకు నడిచే దారి లేకుండా పోయింది. కొన్ని చోట్ల శిథిలమైన ఫుట్‌పాత్‌లపై కాలేస్తే డ్రైనేజీలో పడేటట్లుగా ఉన్నాయి.
- నిత్యం రద్దీగా ఉండే దొండపర్తి రైల్వే న్యూకాలనీ ప్రధాన రహదారిలో అధిక సంఖ్యలో ప్రజలు నడక ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌లు కానరాక పోవడంతో రోడ్డుపైనే నడవాల్సిన పరిస్థితి. ఇక్కడ కొందరు వ్యాపారులు ద్విచక్ర వాహన విక్రయాలు, ఫరి్నచర్, మోటార్ రిపేర్స్ వంటివి ఫుట్‌పాత్‌లపైనే నిర్వహిస్తున్నారు.
- తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డు నుంచి మహారాణి పార్లర్ వరకు అనేక వ్యాపారాలు ఫుట్‌పాత్‌లపైనే జరుగుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడూ వచ్చి తనిఖీలు చేస్తుంటారు. ఆ సమయంలో వ్యాపారులంతా జాగ్రత్త పడతారు. మిగిలిన సమయంలో యథావిధిగానే ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు సాగిస్తుంటారు. కాలిబాటల ఆక్రమణల వల్ల పాదచారులు ఇబ్బంది పడటంతోపాటు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని పలువురు స్థానికులు చెబుతున్నారు. ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించి, శిథిలమైన వాటిని బాగుచేయిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కాలిబాటపై హెల్మెట్ల విక్రయ స్టాల్

చర్యలు తీసుకోవాలి

చిరు వ్యాపారాలు చేసుకునే తమను ఉన్నపళంగా రోడ్డున పడేశారు. నగరంలో చాలా చోట్ల అనేక మంది ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరికి అధికారులు, పోలీసుల సహకారం ఉండటంతోనే ఇలా చేయగలుగుతున్నారు. అధికారులు ఇటు వంటివి ఖాళీ చేయించాలి.

– వి.అప్పారావు, స్ట్రీట్ వెండర్, అక్కయ్యపాలెం

ఫుట్‌పాత్‌లను వినియోగంలోకి తేవాలి

ప్రజలు నడిచేందుకు వీలు లేకుండా ఫుట్‌పాత్‌లు తయారయ్యాయి. వాటిపై మట్టి, వ్యర్థాలు, భవన నిర్మాణ సామగ్రి ఉంటున్నాయి. కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌లు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. జీవీఎంసీ అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లను వినియోగంలోకి తీసుకురావాలి.

– ఎస్.కృష్ణమూర్తి, రైల్వే న్యూకాలనీ

సాంకేతిక రంగాల్లో నైపుణ్యాల ప్రోత్సాహం

సీతంపేట: స్థానిక బుల్లయ్య కళాశాలలో శనివారం గ్లోబల్ హ్యాకథాన్ నాసా ఇంటర్నేషనల్ యాప్స్ చాలెంజ్–2025ను నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథి ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను, పరిశోధకులను ప్రేరేపిస్తూ సమాజ సమస్యలను పరిష్కరించడానికి సృజనాత్మక ఆలోచన, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. లెర్న్, లాంచ్, లీడ్ అంశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం నాసా ఓపెన్ సోర్స్ డేటాను ఉపయోగించి అంతరిక్ష శాస్త్రం, సాంకేతిక రంగాల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, సమస్యల పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి, జి.ఎస్.కె.చక్రవర్తి పాల్గొన్నారు.

నరవ ఐటీఐ టాపర్ రాహుల్‌కు అభినందన



రాహుల్‌కు సర్టిఫికెట్ అందించి అభినందిస్తున్న ఐఎంసీ చైర్మన్ ప్రభాకర్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

కంచరపాలెం: కంచరపాలెం నరవ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ)లో జరిగిన ఆలిండియా ట్రేడ్ టెస్ట్–2025 పరీక్షా ఫలితాల్లో పి.వి.ఎస్.రాహుల్ అనే విద్యార్థి డీజిల్ మెకానికల్ ట్రేడ్‌లో 594/600 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా శనివారం నరవ ఐటీఐ సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎంసీ చైర్మన్ బి.ప్రభాకర్, ట్రెనింగ్ అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి రాహుల్‌ను అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీతంపేటలో మహాన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న సంపంగి శ్రీనివాసరావు, భోగవిల్లి గోవింద్

సీతంపేట: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా సీతంపేటలో రాధాకృష్ణ రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం పాలక మండలి పూర్వ సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భోగవిల్లి గోవింద్, స్థానిక నాయకుడు భీమవరపు శ్రీనివాసరావు, ఇప్పిలి అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సుమారు 4 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భవానీ మాలధారులు పాల్గొన్నారు.

నేడు అన్నసమారాధన

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన లలితాదేవి ఆలయంలో చేపట్టిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, ఎస్.వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద మహా అన్నదానం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాలని వారు కోరారు.

ఆటో డ్రైవర్లకు సాయం

మద్దిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని శనివారం మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపం వద్ద ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. ఉత్తర నియోజకవర్గంలోని 2,563 మంది లబ్ధిదారులకు రూ.3.84 కోట్లు నగదు బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మునీశ, ఆర్డీ దేవి, జోనల్ కమిషనర్ రాము, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ, కార్పొరేటర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, నాయకురాలు శ్యామలదీపిక, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైభవుడికి విశేష సేవలు



మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రోడ్డెక్కిన మ్యాన్‌హోల్ మురుగు



ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీక్తై మురుగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. లైబ్రరీకి వచ్చే విద్యార్థులు, పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. పది రోజులుగా మ్యాన్‌హోల్ లీకవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



దుర్గాదేవి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు పంజాబ్ హోటల్ జంక్షన్ శ్రీ లక్ష్మీగణపతి దుర్గ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వార్డు కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ పాల్గొని దుర్గాదేవిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఆటో స్టాండ్ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



విదేశీ విద్యార్థుల ఓరియంటేషన్‌లో మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ రాంబాబు

మద్దిలపాలెం: విదేశీ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్, అంతర్జాతీయ వ్యవహారాల(ఇన్‌చార్జి) డీన్ ప్రొఫెసర్ కె.రాంబాబు ఆకాంక్షించారు. ఏయూలో వివిధ దేశాల నుంచి ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్) ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు శనివారం ఇంజినీరింగ్ కళాశాల గౌతమబుద్ధ బి.ఆర్.అంబేడ్కర్ ఆడిటోరియంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం సాంకేతిక వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో అడుగేయాలని విదేశీ విద్యార్థులకు సూచించారు. ఐసీసీఆర్ బెంగళూరు జోనల్ డైరెక్టర్ పరదీప్ కుమార్ మాట్లాడుతూ భారతదేశం అనేక దేశాలతో తమ స్నేహాన్ని కొనసాగిస్తూ నాణ్యమైన విద్యను ఆయా దేశాల యువతకు అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని సూచించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన నియమావళి, వివరాలను తెలియజేశారు. ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.ఎం.యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని, వారి భావాలు, ఆలోచనలను స్వాగతించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఏయూ పరంగా కళాశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు అవసరమైన సహకారాన్ని ఎల్లవేళలా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీసీఆర్ తరఫున కొత్తగా ప్రవేశం పొందిన సుమారు 300 మంది అంతర్జాతీయ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండాడలోనే భవన నిర్మాణం చేపట్టాలి



మాట్లాడుతున్న అల్లి అప్పలనారాయణ

దాబాగార్డెన్స్: యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండాడలో కేటాయించిన స్థలంలోనే యాదవ సంఘం భవన నిర్మాణం చేపట్టాలని జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అల్లి అప్పలనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఐక్యవేదిక ప్రతినిధులు దాసు మోహనరావు, అల్లు రమణతో కలిసి మాట్లాడారు. యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంఘ భవనానికి జీవో జారీ చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ జీవోని రద్దు చేసి స్థలం మార్పునకు ప్రయత్నిస్తుందన్నారు. దీని వల్ల యాదవ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, తక్షణమే కూటమి ప్రభుత్వం తన ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. యాదవులు అభివృద్ధి చెందాలంటే సంఘ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్, యాదవ సంఘం మహిళా నాయకురాలు అనుపమ, డొక్కర అప్పారావు, జోగ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

బీచ్‌రోడ్డు: విశాఖ పోర్టులోని జేపీ ఆఫ్‌షోర్‌లో పని చేస్తున్న కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.ఎం. కుమార మంగళం మాట్లాడుతూ నెలకు రూ. 17,524 వేతనం అయితే రూ. 14,500 ఇస్తున్నారని, 12 గంటలు పని చేయిస్తున్నారని తెలిపారు. అలాగే సెలవులు ఇవ్వడం లేదని, వీక్లీ ఆఫ్ అమలు చేయడం లేదని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే కార్మికులను ఆపేయడం చట్ట వ్యతిరేకమన్నారు. జేపీ యాజమాన్యం ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా కార్మికులను ఆపేసిందన్నారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, ముఖ్యంగా పండగ ముందు రోజు కార్మికులను విధులకు హాజరు కాకుండా ఆపేసిందన్నారు. ఈ యాజమాన్యంపై కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బి. జగన్, నాయకులు శ్రీను, తాతలు, అచ్యుత్, తరుణ్, కొర్లయ్య, ముత్రాజు తదితరులు పాల్గొన్నారు

కూలిన చెట్ల తొలగింపు ముమ్మరం



సంఘం ఆఫీస్ రోడ్డులో కూలిన చెట్లను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న సిబ్బంది



సంఘం ఆఫీస్ వద్ద తెగిపడిన విద్యుత్ వైర్లను సరిచేస్తున్న సిబ్బంది

సీతంపేట: దసరా పండగ రోజున గాలివాన బీభత్సానికి పడిపోయిన చెట్లు, కొమ్మల తొలగింపు పనులు శనివారం ముమ్మరంగా చేపట్టారు. 26, 43, 27 వార్డుల్లోని శ్రీనగర్ రోడ్డు, శంకరమఠం రోడ్డు, అక్కయ్యపాలెం, సంఘం ఆఫీస్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగించి తరలించారు. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో పొక్లెయిన్‌తో ఈ పనులు చేపట్టారు. సంఘం ఆఫీస్ రోడ్డులో విద్యుత్ సిబ్బంది కొత్త పోల్ వేసి తెగిన విద్యుత్ తీగలను పునరుద్ధరించారు. ఎన్టీ స్కూల్ రోడ్, చాకలిపేట, లలితానగర్, శంకరమఠం రోడ్డులో బేకర్స్ డెన్ వద్ద,, శ్రీనగర్ రోడ్డులో షాపులకు అడ్డుగా పడి ఉన్న చెట్లను తొలగించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయం ఆవరణలో పడిపోయిన చెట్లను కూలీల చేత తొలగింపజేశారు. గ్రంథాలయం ముందు కూలిన విద్యుత్ స్తంభం, తెగిపడిన తీగలను ఇంకా పునరుద్ధరించలేదు. బీవీకే కళాశాల ఎదురుగా బస్ షెల్టర్ పక్కన నేలకొరిగిన భారీ వృక్షాన్ని తొలగించకుండా వదిలేశారు. చాలా చోట్ల చెట్ల కొమ్మలను ఒక పక్కకు నెట్టి కుప్పలుగా ఉంచారు. వీటిని తరలించాల్సి ఉంది. పూర్తి స్థాయిలో చెట్ల కొమ్మలను తరలించి, విద్యుత్ తీగలు, స్తంభాలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.



ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద తరలించకుండా వదిలేసిన చెట్ల కొమ్మలు

జీఎస్టీ ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన



జీఎస్టీ ప్రయోజనాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీతంపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో శనివారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీఎస్టీ అంటే ఏంటి?, దాని వల్ల దేశానికి, రాష్ట్రానికి కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై విద్యార్థులు తయారు చేసిన ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషోర్, రమణి, శ్యామల, ప్రభాకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం, వై.రామలక్ష్మి, కిరణ్ కుమార్, గ్లోరీ, అప్పారావు, జ్యోతి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవం



వేడుకల్లో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

దాబాగార్డెన్స్: మెలోడి క్రియేటర్స్ రజతోత్సవం (25వ వార్షికోత్సవం) శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వ విద్యాలయం గౌరవ చాన్స్‌లర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, కనకమహాలక్ష్మి దేవాలయం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ), వీవీ రమణమూర్తి, ప్రముఖ సంఘ సేవకుడు, ప్రేమసమాజం అధ్యక్షుడు మట్టపల్లి హనుమంతరావు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన 'మెలోడీ సాంస్కృతిక వైభవం'రజతోత్సవ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సంస్కృతికి, సంగీతానికి ప్రాధాన్యత నిస్తూ ఎన్నో సంగీత కార్యక్రమాలు నిర్వహించి ఎందరో వర్ధమాన కళాకారులను ప్రోత్సహిస్తున్న సంస్థ నిర్వాహకులు సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎంపీ రాజశేఖర్, కదలిని అభినందించారు. అనంతరం నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి, ఆధ్యాత్మిక వేత్త ఎంపీ రాజశేఖర్, కన్వీనర్ కదలి వీరాస్వామి, వి.ప్రభాకర్, ఎంఎస్ మాధవ్, ఎం.పుండరీకుమార్, ఎస్.విజయ కుమార్, సీహెచ్ చిట్టిబాబు, కొణతాల రాజు, ఎం.మస్తాన్‌రెడ్డి, చీరాల ఉష, కె.అరుణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసి పూజ



తులసి పూజలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

తగరపువలస: విశాఖ జిల్లా జాలారిపల్లిపాలెం గంగవరం కబడ్డీ గ్రౌండ్‌లో ఈ నెల 9 నుంచి 11 వరకు రాష్ట్ర స్థాయి పురుషుల ఆహ్వాన కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి జె.వి.ఎస్.ప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం ఆయన చిట్టివలసలో మాట్లాడుతూ జె.పి.ఎం. స్పోర్ట్స్ క్లబ్ 19వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి అనుమతితో విశాఖ జిల్లా కబడ్డీ సంఘం పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రబ్బర్ మ్యాట్లపై నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లా పురుషుల కబడ్డీ జట్లు పాల్గొంటాయన్నారు. ఈ పోటీలలో విజయం సాధించే నాలుగు జట్లుకు జీవీఎంసీ 64వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ధర్మాల శ్రీను, ఇతర దాతల సాయంతో జె.పి.ఎం.స్పోర్ట్స్ క్లబ్ నగదు బహుమతులు ప్రకటించిందన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.35 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు, నాలుగో బహుమతి కింద రూ.15 వేలు ఇవ్వనున్నట్టు ప్రసాదరెడ్డి ప్రకటించారు.